



# ఆడపిల్ల

సూర్యకమల్

శ్రీరామనవమి ఆ రోజు! శ్రీ సీతారాముల కళ్యాణ వైభవాన్ని తిలకించడానికి భక్తులందరూ వేంచేశారు!

శ్రావణి తన కొడుకుని తీసుకొని ఆలయానికి వచ్చింది! ఆ దివ్య మంగళ విగ్రహాలకు భక్తితో నమస్కరించి ఒకప్రక్కగా చోటు చూసుకొని కొడుకుని వళ్ళో పెట్టుకొని కూర్చొంది.

కొంచెం దూరంలో కొంతమంది పిల్లలు ఆడుకొంటున్నారు. వాళ్ళని చూసిన వాగధీష్ తల్లి వడినుండి తప్పించుకొని మెల్లగా... అతి మెల్లగా అడుగులు వేసుకొంటూ మధ్య... మధ్య తల్లిని గమనిస్తూ వెళ్ళి ఆ పిల్లలతో కలిసి ఆడుకో సాగాడు.

వాడినే గమనిస్తున్న శ్రావణి, తననుండి తప్పించుకోడానికి వాడు పడ్డ తాపత్రయం నవ్వు తెప్పించింది.

సన్నాయి పాట స్పీడ్ అందుకొంది! భక్తులు తన్మయత్వంతో భజనలు చేస్తున్నారు. అర్చక స్వాములు శ్రీ సీతారాముల విగ్రహాలకు తలంబ్రాలు పోస్తున్నారు. శ్రావణి మనసు ఆలోచనలతో వేగిపోతోంది.!

తన పెళ్ళి సరిగ్గా శ్రీరామనవమి వెళ్ళిన మరునాడు జరిగింది. అరవై వేలు కట్నం! అది చాలక అత్తగారు అది ఆచారం! ఇది సాంప్రదాయం అంటూ ఐదు వేలదాకా లాంఛనాల రూపంలో తీసుకొన్నారు! అతి వైభవంగా పెళ్ళి జరిగినా మగపెళ్ళివారికి మర్యాదలు చాలలేదు



కొడుకు: నాన్న కాకి అరిస్తే బంధువులు వస్తారా?

తండ్రి: అవునురా

కొడుకు: మరి వచ్చిన బంధువులు ఎలా పోతారు?

కూతురు: అమ్మ అరిస్తే.

అంటూ ఏదో పేచీ పెడుతూనే ఉన్నారు!

ఆ మరునాడు శోభనం చేయమని ఒకటే పేచీ! పెళ్ళి జరిగినాక మీ ఇంట శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం మన సాంప్రదాయం కదా అని ఆడపెళ్ళివారి తరఫు పెద్దలు ఎంత చెప్పినా వినలేదు! పైగా మాది అమెరికా లైఫు! మీరు చెప్పినవి పాతకాలపు ఆచారాలు! తర్వాత వీలు చూసుకొని నా కొడుకునీ— కోడలినీ అన్నవరం తీసుకెళ్ళి ఆ స్వామికి వ్రతం చేయిస్తాము. శోభనం చేయవలసిందే అని పట్టుపట్టారు.

పెళ్ళి అయేదాకా భర్త ఎవరో తెలియదు! కొత్తగా, భయంగా శరీరం అర్పించుకొంది! మూడు రాత్రులు గడిచాయి! నాలుగో రోజు ప్రయాణం! అత్తగారు అమ్మ దగ్గరకు వచ్చి—

"ఇదిగో వదినగారూ! మీరేమీ శ్రమపడి సారె— చీరలు సర్దకండి! ఒక నెలరోజుల్లో ఇల్లు చూసుకొని మా అబ్బాయి వచ్చి కోడలిని తీసుకొని వెడతాడు! అపుడు మీరు కూడా రావాలి సుమా! చూడండి మా వాడి మొహం ఎంత వాడిపోయిందో! కుర్ర సన్యాసి భార్యను వెంటతీసుకొని వెళ్ళలేకపోతున్నానని ఎంత బాధపడుతున్నాడో!" అంటూ కళ్ళు తుడుచుకొంటున్న అత్తగారిని వింతగా చూశారు అందరూ! అమ్మ మాత్రం తోటకూర కాడలా నలిగిపోయిన కూతుర్ని చూసి కళ్ళనీళ్ళు కార్చింది. కట్నకానుకలు మూటకట్టుకొని వెళ్ళిన వియ్యాలవారి వద్దనుండి లెటర్ లేదు! పదహారు రోజుల పండుగ అయింది అలా... అలా నెల దాటింది! కనీసం తనకయినా తన భర్త ఒక లెటర్ వ్రాయలేదు. దిగులుగా ఉంది శ్రావణికి . కళ్ళు తిరుగుతూన్నట్లు, ఏది తిన్నా వాంతి వచ్చేట్టు ఉంది. అలా మరో నెల గడిచింది! తల్లితో చెప్పింది తన పరిస్థితి! ఆవిడ తలబాదుకుంటూ—

"ఇదేం ఖర్మమే తల్లీ! పెళ్ళి చేసుకొని వెళ్ళారు. ఓ ఉత్తరమైనా రాయలేదు! నీకు నెల తప్పినట్లున్నదే!" శోకాలు పెట్టసాగింది.

అమ్మపోరు పడలేక నాన్న, అన్నయ్య కలిసి వాళ్ళ ఊరు వెళ్ళారు. రెండు రోజులకి దిగులు మొహాలతో వచ్చిన అన్నయ్యను, నాన్నని చూసి ఆశ్చర్యపోయాం! 'విషయం ఏమిటి?' అని అడిగిన అమ్మతో—

"వాళ్ళు ఆ ఊళ్ళో లేరు! నెల క్రితమే ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారట! ఏ ఊరు వెళ్ళారో మాకు తెలియదు అన్నారు!" నాన్న మాటలు విని కుప్పకూలిపోయాం!

మధ్యవర్తి దగ్గరకు వెళ్ళి అడిగితే—

"మీరు సంబంధం చెప్పమన్నారు! చెప్పాను! అంతకుమించి నాకు ఏమీ తెలియదు!" అంటూ మరో మాటకు అవకాశం ఈయలేదు పెళ్ళి కుదిర్చిన మధ్యవర్తి.

మింగలేక, కక్కలేక అన్నట్లుగా గడుస్తోంది కాలం! కడుపులో శిశువు రూపుదిద్దుకొంటోంది.

ఆ రోజు పిడుగులా వచ్చింది టెలిగ్రాం! అతను కారు ఏక్సిడెంట్‌లో మరణించాడని! ఎన్నిసార్లు ఆ టెలిగ్రాం త్రిప్పి, త్రిప్పిచూసినా ఎడ్రస్ లేదు! ఎక్కడికని వెళతారు? ఆ తర్వాత రెండు రోజులకి ఓ లెటర్ వచ్చింది!

"మీ అమ్మాయి జాతకం మంచిది కాదు! ఉన్న ఒక్క కొడుకూ మరణించాడు! విరక్తి చెందిన మేము 'కాశీ' వెడుతున్నాం! ఇంక మమ్మల్ని మర్చిపోండి!" అంటూ.

అందరి మనసులు శిథిలం అయిపోయాయి ! కడుపులోని పిండం మాత్రం ఎదుగుతోంది! ఇటువంటి దారుణ పరిస్థితిలో 'తనకంటూ ఓ తోడు ఉండడం మంచిది' అనే అభిప్రాయం అందరికీ కలిగింది! ఆ ఫలితమే 'వాగధీష్' పుట్టుక. పిల్లవాని ఆలన— పాలనలో జీవితం క్రొత్త మలుపు తిరిగింది. అన్నయ్య పెళ్ళి మరో మలుపు! కాపురానికి వచ్చిన కొలది కాలంలోనే ఇంట్లో అందరినీ తన కనుసన్నలలో నడిపించసాగింది వదిన! 'ఎవరి అదృష్టం వారిదే!' అనుకుంటూ కాలం గడపసాగింది శ్రావణి.

ఎండాకాలం వెళ్ళి వానాకాలం వచ్చింది.ఆకాశంలో మబ్బులు దట్టంగా ఉన్నాయి! తన జీవితంలాగే కలత బారిన మనసుతో అలా ఉండి పోయింది ఎంతోసేపు!

కస్తూరి పావుగంట నుండి గమనిస్తోంది చలనంలేని స్నేహితురాలిని చూసి చాలా బాధపడింది.

"శ్రావణీ ఇలా పిచ్చిదానిలా కాలం గడపకపోతే ఏదయినా కాన్వెంటులో టీచర్‌గా చేరకూడదా".

"నాకెవరిస్తారే ఉద్యోగం B.Ed. లేదు!"

"ఇప్పిస్తే చేస్తావా? మా నాన్నగారికి తెలిసిన కాన్వెంటు ఉంది ప్రయత్నిస్తాను." కాసేపు శ్రావణి దగ్గర కూర్చొని ఇంట్లో అందరికీ చెప్పి మరీ వెళ్ళింది. అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. శ్రావణికి ఏదో ఒక వ్యాపకం ఉంటే తన బాధనుండి రిలీఫ్‌గా ఉంటుంది.

రెండు రోజులకు వచ్చింది కస్తూరి. తొందరగా రెడీ అవమని శ్రావణికి చెప్పి అన్నతో ఈ విషయం మాట్లాడింది. అందరినీ శాసించగల వాగ్ధాటి కస్తూరికి ఉంది. అన్నయ్య వెంటనే తన అంగీకారం తెలియజేశాడు.

శ్రావణి, కస్తూరి కలసి ఆ కాన్వెంటుకి వెళ్ళారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడింది కస్తూరి. L.K.G. కి టీచర్ కావాలి మీ కిష్టమయితే చేరమనండి జీతం 300 రూపాయలు అని చెప్పారాయన. ఏదో ఒకటి చేరమంటూ సైగచేసింది కస్తూరి. L.K.G. టీచర్‌గా చేరింది ఆరోజే. ఒకటి, రెండు రోజులు కొత్తగా ఫీల్ అయింది. తొందరగానే వర్క్ నేర్చుకొంది. ఆ చిన్న పిల్లలతో కాలం తెలియకుండా గడిచిపోతోంది.

"మేడమ్!"

పిల్లలకి హోంమ్ వర్కు రాస్తున్న శ్రావణి తల ఎత్తి చూసింది. రెండవ తరగతి మాష్టారు వంశీ కృష్ణ! అతను అందరినీ నవ్విస్తూ సరదాగా ఉంటాడు. శ్రావణి లేచి నిలబడి అతనివైపు చూసింది. "ఏమిటి?" అన్నట్లుగా.

"ఈ రోజు టీచర్స్ అందరం కలిసే సినిమాకు వెడుతున్నాం! మీరుకూడా రావాలి!"

"నాకు— వీలుపడదు! ప్లీజ్!"

"అందరం వెడుతున్నాం! ఏ ఒక్కరూ మిస్ అవకూడదు! మీరు వస్తున్నారు! ఒ.కె!"

కుర్చీలోనీరసంగా కూర్చుండి పోయింది శ్రావణి, కస్తూరి దగ్గర గొప్పగా మాట్లాడిందికాని వదిన తనని ఏదో సూటిపోటిగా అంటూనే ఉంది! ఈరోజు సినిమాకెడితే ఆవిడ వాగ్ధాటి ఏవిధంగా ఉంటుందో! ఆలోచనతో సతమతమవుతున్న శ్రావణితో లక్ష్మి అంది. ఆవిడ U.K.G. చూస్తుంది.

"ఇలాంటివి మామూలే! అందరం కలిసి వెళ్ళాలి అంటే మనకి ఏ ప్రోబ్లమ్ ఉన్నా వెళ్ళితీరాలి! లేకపోతే మీరు అందరితో కలిసి —మెలిసి ఉండే మనస్తత్వం కాదని నిర్ధారణ చేస్తారు! లేనిపోనివి కల్పించి మనమీద కంప్లయింట్స్ సార్‌కి చేరవేస్తాడు! మనఉద్యోగం ఊడిపోతుంది! ఇలాంటి విషయాలలో చాలాజాగ్రత్తగా ఉండాలి!" ఆలోచిస్తూండి పోయింది శ్రావణి.

ఇంటికి వచ్చినప్పటి నుండీ అన్యమనస్కంగా ఉన్న కూతుర్ని చూసి.

"ఏమయిందే!" అంది అమ్మ. జరిగింది చెప్పింది శ్రావణి. "వెళ్ళు! నీకూ కొంత మార్పుగా ఉంటుంది!"

వీళ్ళ మాటలు విన్న వదిన

"వెళ్ళమ్మా! ఉద్యోగస్తురాలవాయె! దాని కోసం చింతఎందుకు? శ్రావణి తన పనులు చేసుకొని వాగధీష్ చేత అక్షరాలు దిద్దిస్తూ కూర్చొంది. వీధి తలుపు చప్పుడుకు తలఎత్తి చూసింది. అటుగా వచ్చిన వదిన చాపపరచి అందరినీ

కూర్చోపెట్టి "శ్రావణీ! మాట్లాడుతూండు! నేను కాఫీ కలిపితెస్తా!"

"ప్లీజ్! వద్దండీ టైం అయిపోతోంది. శ్రావణి గారు ఎక్కడ రారో అని మేము వచ్చాం! రండి శ్రావణి గారూ!" అంటూ తొందరచేసారు.

"బాబును కూడా తీసుకెళ్ళు వాడూ చూస్తాడు!అంటూ తన గదిలోకి వెళ్ళి ఇరవై రూపాయల నోటు తెచ్చి శ్రావణి చేతిలో పెట్టింది వదిన."

సినిమా హాల్లో చాలాసరదాగా గడిచింది. పెళ్ళి అయిన దగ్గర నుండి అన్ని సరదాలు వది లేసుకొని మోడులా బ్రతికేస్తోంది! ఈ కొండంత అనుభూతి చిన్న ఉద్యోగం వల్ల లభించింది! సినిమా అయింది! అందరూ హాయిగా నవ్వుకుంటూ హాలు బయటకి వచ్చారు.

"శ్రావణీ గారూ! వంశీకృష్ణగారు మీకు తోడుగా వచ్చి మీ ఇంటి దగ్గర మిమ్మల్ని దింపి వెడతారు! ఆయన ఇల్లు మీఇంటి మీదుగా కూడా వస్తుంది! మేము ఈ వీధిగుండా వెడతాం! అంది లక్ష్మి టీచర్! వీడ్కోలు అనంతరం నడక సాగించారు!"

వాగ్ ధీప్‌నిద్రపోతున్నాడు, వాడిని ఎత్తుకొని భారంగా నడుస్తున్న శ్రావణిని చూసి—

"బాబుని ఇలా ఈయండీ!" తన అంగీకారం తెలపకుండానే బాబుని తీసుకొని నడవ సాగాడు వంశీ!

క్షణం భర్త గుర్తుకు వచ్చాడు శ్రావణికి! అతను బతికి ఉంటే ఇలానే నడిచే వారంకదా! మనసులో గాయం మరలరేగింది! నీరు నిండిన కళ్ళు కొంగుతో తుడుచుకొంది.

మేడమ్! మిమ్మల్ని చూస్తోంటే బాధ అనిపిస్తోంది! అసలు దేముడు ఉన్నాడా? అనిపిస్తుంది! మాటలు మార్చి జోకులు వేసి కలతబారిన మనసును నవ్వింపచేశాడు.

ఇల్లు దగ్గర పడింది. అన్నయ్యా— వదిన వీధి అరుగుమీదే కూర్చున్నారు.

"నీ కోసం వద్దాం అనుకుంటున్నానమ్మా!" అంటూ బాబుని తీసుకొని వంశీకృష్ణకు థాంక్స్ చెప్పాడు అన్నయ్య. కాసేపు వంశీతో కబుర్లు చెప్పి అందరూ లోపలికి వచ్చారు.

అన్నయ్యా— వదిన వాళ్ళ బెడ్‌రూంలోకి వెళ్ళిపోయారు. శ్రావణి బాబును పడుకోపెట్టి, తను కాళ్ళు కడుక్కొని వంటగదిలోకి వెళ్ళింది.

టీచర్: లెక్కలు తప్పులు చేసి ఇంకా నవ్వుతున్నావా? సిగ్గు లేదు!

విద్యార్థి: మా డాడీ చేసిన తప్పులకు నేనెందుకు సిగ్గుపడాలి?



గిన్నెలో కొద్దిగా అన్నం ఉంది. ఆ కాస్త అన్నం మజ్జిగ పోసి కలిపి బాబుని లేపి తినిపించింది. తను కాస్త మజ్జిగ తాగి పడుక్కొంది. 'వదిన భలే నటించగలదు! అదృష్టవంతురాలు!' అనుకొంది శ్రావణి. కళ్ళు మూసుకొంది. కాని నిద్ర రావడం లేదు! మంచంపై అటూ— ఇటూ దొర్లసాగింది. అన్నా— వదిన మాటలు సన్నగా విన్పిస్తున్నాయి!

అతను బాగానే ఉన్నాడు! పెళ్ళి చేసుకుంటుందేమో మీ చెల్లెలు!

"అది అలా చేస్తే ముందు సంతోషపడే వాడిని నేనే! ఎందుకంటావా! శ్రావణిని, కొడుకుని, అమ్మని— నాన్నని, నిన్ను, నీకు పుట్టబోయే పిల్లల్ని ఇంతమందిని పెంచాలి! బాబోయ్! నావల్ల కాదు! ఆలోచనలు ఆపి దగ్గరగా రా!"

మనసులోని గాయంపై కారం చల్లినట్లు అనిపించింది! ప్రతినెలా జీతం మూడు వందలు అన్నయ్యకే ఇస్తోంది శ్రావణి!

"ఎందుకమ్మా? అంటూనే తీసుకుంటాడు! ఈ రాత్రి తను అన్నం తినలేదని అన్నయ్యకు తెలుసా! ఎప్పటికో కునుకు పట్టింది"

"మేడమ్"

స్కూల్ టైం అయిపోయింది; ప్రిన్సిపాల్ ఏమంటాడో అనే కంగారుతో వేగంగా నడుస్తోన్న శ్రావణి ఆ పిలుపుతో ఆగి వెనక్కి చూసింది.

"థాంక్యూ మేడమ్!" అంటూ సైకిలు దిగుతున్న వంశీకృష్ణ ముఖంలోకి ఏమిటన్నట్లు చూసింది.

"మీతో చాలా మాట్లాడాలి! రేపు సన్—డే కదా! ఉదయం తొమ్మిది గంటలకు 'వేణుగోపాల స్వామి' టెంపుల్‌కు రాకూడదూ! తప్పకరండి! ప్లీజ్..."

"నో...! నో...! ప్లీజ్!" గట్టిగా అరవాలనిపించింది! అప్పటికే కొన్ని కళ్ళు తమని పరిశీలిస్తున్నాయి! అందుకే తమాయించుకొంది! 'ప్రయత్నిస్తాను!' అని చెప్పి నడక వేగం హెచ్చించింది.

స్కూల్‌కు చేరేసరికి పది నిముషాలు లేటయింది! ప్రిన్సిపాల్ కళ్ళు ఎర్రగా చేసుకొని కోపంగా చూశాడు.

'సారీ సర్!' అని చెప్పి సంతకం ముగించుకొని క్లాస్‌రూంకెళ్ళి వర్క్‌లో లీనమయింది!

కాలం ఎవరితోనూ స్నేహం పెట్టుకోదు! విరామం లేకుండా తన ప్రయాణం కొనసాగిస్తూనే ఉంటుంది.

"ఈ రోజు సెలవు కదా! ఎక్కడికి ప్రయాణం అయ్యావు?" వదినమ్మ వెటకారంగా అంది. అమ్మ కూడా చేతిలో పని ఆపి, నేను ఏమిచెప్తానో వినడానికి నాకేసి చూడసాగింది.

"వేణుగోపాలస్వామి గుడికి వస్తానని అనుకున్నానమ్మా! ఈ రోజు సన్—డే కదా! వెడదామని!" అమ్మకి, వదినకి వినపడేలా చెప్పి బయటపడ్డాను! నేను చెప్పులు వేసుకోవడం చూసి వాగధీష్ వెంటపడ్డాడు. వాడిని నడిపిస్తూ గుడి దారి పట్టాను.

"హాయ్! శ్రావణి! బాగున్నామా?"

"అరే! వెంకటేష్! నువ్వా! ఈ ఊరు ఎప్పుడు వచ్చావు? నిన్ను చూద్దామనే వస్తున్నాను! కస్తూరిని కలిశాను నిన్న! నీ గురించి చెప్పింది చాలా బాధపడ్డాను! కాలేజీ రోజుల్లో భావి జీవితాలను గురించి ఎన్ని ఊహలు! ఎన్ని కలలు కన్నాం! ఇంత విషాదం ఎలా భరిస్తున్నావు శ్రావణీ!"

ఒక విద్యుత్ ఘాతం ఒళ్ళంతా పాకినట్లయింది! ఉబికివచ్చే కన్నీరును పంటి బిగువున ఆపుకొంటూ...!

"రా! మా ఇంటికి వెళ్ళి మాట్లాడుకొందాం!"

'నీ కొడుకేనా? అంతా నీ పోలికే!' బాబుని ఎత్తుకొని ముద్దుపెట్టుకొన్నాడు!

"ఆ!ఆ! తల్లిలాగే అదృష్టం!" అంటూ ఇంటి వైపు దారితీసింది! మెట్లు ఎక్కుతుండగా విన్పించింది వదిన గొంతు—

"ఈవిడగార్కి ధైర్యం ఎక్కువ అయిందే! ఈ మధ్య" అంటూ ఆవిడ గదిలోకి వెళ్ళిపోయింది! కిటికీలోంచి తమను గమనిస్తుందని తెలుసు శ్రావణికి.

కొబ్బరి బొండం తాగేటప్పుడు బాగానే ఉన్నాడు తాగాక పడ్డాడేమిటయ్యా

ఏమీ లేదు కొబ్బరి బొండం రేటు చెప్పేసరికి కళ్ళు తిరిగి వుంటాయి మామూలుగా చెప్పాడు షాపువాడు.



"రా వెంకటేష్! కూర్చో! కాఫీ తెస్తానుండు!" అంటూ వంటగదిలోకి వెళ్ళింది.

వెంకటేష్ ఇంటినంతటినీ పరిశీలించసాగాడు! గోడనున్న ఫోటోలను చూస్తూ ఒక ఫోటోని పరిశీలనగా చూడసాగాడు!

కాఫీ కప్పుతో ఆ రూంలోకి వచ్చిన శ్రావణి—

"అది మా పెళ్ళి ఫోటో!"

"ఇతన్ని నేను చూశాను! చాలాసేపు మాట్లాడాను కూడా!" పరిశీలనగా చూస్తూ అన్నాడు వెంకట్.

అపుడే ఇంట్లోకి అడుగు పెట్టిన అన్నయ్య—

"నిజంగానా?" అన్నాడు. నాకు నోటిమాట రాలేదు! అమ్మా— నాన్న, వదిన అందరూ ఆ రూంలోకి వచ్చి వెంకటేష్ కేసి ఆశ్చర్యంగా చూడసాగారు.

"మీరు చెప్పేది నిజమేనా?" "ఇతనే—! మా ఫ్రెండ్ ఆఫీసులో చేస్తున్నాడు! చాలాసార్లు కలిశాను! పెళ్ళి కాలేదని చెప్పాడే!" వెంకటేష్‌కి అంతా ఆశ్చర్యంగా ఉంది! మనిషిని పోలిన మనిషి ఉంటాడు అంటారు నిజమా?

అన్నయ్య, వెంకటేష్ చాలాసేపు మాట్లాడుకొన్నారు! "నాకు ఇతన్ని చూపించండి! మీరు ఎప్పుడు వెడుతున్నారు? మీతో నేనూ వస్తాను!"

"తప్పకుండా! శ్రావణి కోసం ఆ మాత్రం చేయలేనా? ఇతను— అతనే అయితే శ్రావణి కాళ్ళ మీద పడేస్తాను!" ఆవేశంగా అన్నాడు వెంకటేష్.

"రేపు వెడుతున్నాను! నాతో కూడా రండి!" అందరికీ చెప్పి వెళ్ళిపోయాడు వెంకటేష్.

అన్నయ్య, వెంకటేష్ ఆ మర్నాడు వెళ్ళారు! మా అందరికీ టెన్షన్! ఏదో వండుకుంటున్నాం! తింటున్నాం! స్కూలుకు వెళ్ళ బుద్ధి కాలేదు. అలా ఉండిపోయాం అందరం! అమ్మ మాత్రం దేముడికి ఒకటే దండాలు పెట్టేస్తోంది. స్వర్గంలో ఉన్న తన అల్లుడు ముంగిట వాలాలని!

నాలుగో రోజుకు అన్నయ్య వచ్చాడు! చాలా అలసటా, దిగులు అన్నయ్యలో కన్పించాయి! అందరం అన్నయ్య కేసి చూస్తున్నాం!

"కాసిని మంచినీళ్ళు ఇయ్యండే!" కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

వదిన మంచినీళ్ళు, నేను కాఫీ ఇచ్చాం! అవి త్రాగి—

"వాడేనే రాస్కెలు! నన్ను చూసి అతి తెలివిగా తప్పించుకొన్నాడు! కానీ వేటాడి పట్టుకొన్నాంలే! సంగతంతా ఆఫీసర్‌కి చెప్పి ఒక రోజు లీవ్ కూడా ఈయవద్దని చెప్పివచ్చాం! వెంకటేష్, అతని స్నేహితులు కదలనీయరులే అందరూ బయలుదేరండి శనివారం అక్కడికి చేరుకోవాలి! ఈ విషయం ఎవరితోనూ అనకండి! ఏం జరుగుతుందో తెలియదు! వాడు పెద్ద కేడీగాడు!" పళ్ళు నూరాడు అన్నయ్య.

అమ్మ గబగబా వంటగదిలోకి వెళ్ళి కుంకం పట్టుకొచ్చి నా నుదుట పెట్టింది. పెట్టెలో పడేసిన మంగళసూత్రాలు నా మెళ్ళో వేసింది. క్రొత్త మెరుపన్నా తగ్గలేదు! గట్టిగా నవ్వాలనీ! పిచ్చిగా అరవాలనీ ఉంది అలా ఉండిపోయాను! నా భర్త నయవంచకుడని ఏడవనా? బ్రతికి ఉన్నాడని సంతోషపడనా?

"స్కూల్‌కి వెళ్ళి చెప్పి రా ఈ రోజయినా!"

కాలింగ్ బెల్ మోతతో తలుపు తీసింది కాంతం.

తెల్లని దుస్తులు! రెండు చేతుల వేళ్ళకి వజ్రాల ఉంగరాలు! మెడలో బంగారు గొలుసు! బంగారు వాచీ! చూడగానే జమీందారులా అనిపిస్తున్నాడు విఠల్.

"నేను లోపలికి రావచ్చా! మీ ఇంట్లో అందమయిన అబ్బాయి పెళ్ళికి ఉన్నాడని వినివచ్చాను! మా అమ్మాయి లక్ష్మి! అందం! ఐశ్వర్యం! చదువు, వినయ, విధేయతలు! ఇన్ని ఉన్న నా ఏకైక సంతానం! మీ ఇంటి కోడలుగా చేద్దామనే ఉద్దేశంతో వచ్చాను!"

"రండి... రండి!" అంటూ కూర్చోబెట్టి మర్యాద చేసింది. ఆమె భర్తని పిలిచి పరిచయం చేసింది!

ఈవిడ ఇంత లావుగా ఉంది! ఈయన సన్నంగా ఉన్నాడు బహుశా భార్యావిధేయుడు కాబోలు అనుకొన్నాడు.

"అబ్బాయిని కూడా పరిచయం చేయండి!" పరిశీలనగా ఇల్లంతా చూస్తూ అన్నాడు విఠల్.

"అలాగే అన్నయ్యగారూ! మా అబ్బాయికి లక్ష రూపాయలు, కారు ఇస్తామని నిన్ననే ఎవరో వచ్చివెళ్ళారు!"

"దానిదేముంది అక్కయ్యగారు! మా అమ్మాయి నాలుగు లక్షలకు అధికారి! మేడ కూడా దానిదే! పెళ్ళి అవగానే నేను 'కాశీ' వెడదాం అనుకుంటున్నాను! నాకు చివరిదశలో 'కాశీ'లో ఉండాలని కోరిక!"

"మేము కూడా బాబు పెళ్ళి అవగానే 'కాశీ'లో స్థిరపడి ఆ విశ్వనాథుని సేవించుకుంటూ విశ్రాంతిగా గడపవలెనని కోరికతో ఉన్నాం!" అంటూ ప్రక్క గదిలోకి వెళ్ళి కొడుకుని లేపి తీసుకొచ్చింది కాంతం!

రాత్రి అంతా నిద్రలేని మొహంలా ఉంది అతని మోము! బద్ధకంగా వచ్చి కూర్చున్నాడు విఠల్‌కి ఓ నమస్కారం పడేసి.

అతన్ని పరికిస్తూ "ఆహా! ఏమి అందం! ఇలాంటి అబ్బాయి కొరకే వెతుకుతున్నా; ఈడూ — జోడూ బాగుంది! ఇదిగో మా అమ్మాయి ఫోటో, జాతకం! చూడ్డానికి ఎప్పుడు వస్తారు?"

"రేపు వస్తాం! మళ్ళా బాబు ఊరు వెడదాం అనుకుంటున్నాడు!" అంది కాంతం. "రేపు వద్దు! నాకు కొంచెం పనుంది! ఆదివారం ఉదయం నేను వచ్చి తీసుకెడతాను రడీగా ఉండండి" అందరికీ చెప్పి బయటికి వచ్చాడు విఠల్. తలుపులు మూతపడగానే సడిచేయకుండా తలుపు దగ్గరకు వచ్చాడు. "అమ్మా! మళ్ళీ ఈ పెళ్ళేమిటి? నన్ను ఈ విధంగా బ్రతకనీయవా? నేను రాను! మొన్న మా బావమరది కనపడ్డప్పటి నుంచీ ఒకటే కంగారుగా ఉంది. ఆ రోజే వాణ్ని తప్పించుకొనేసరికి తలప్రాణం తోక వరకూ వచ్చింది."

"నువ్వు ఎలాగూ అమెరికా వెళ్ళాలనుకుంటున్నావా? ఈ పెళ్ళి తొందరలో ముగించి నాలుగు లక్షలు మనచేతిలో పడగానే ఏమి చేయాలో నేను ఆలోచిస్తాలే! ఈ రాజ్యం ప్లాన్ ఏదీ ఇంతవరకూ జరగకపోవడం అనేది లేదు! నువ్వు నిశ్చింతగా ఉండు!" పొంచి వీళ్ళ మాటలు వింటున్న విఠల్ తృప్తిగా నవ్వుకున్నాడు.

పెళ్ళిచూపుల ఏర్పాట్లు చాలా ఘనంగా ఉన్నాయి! అడుగడుగునా మర్యాదలు! టిఫెన్లు... డ్రింక్‌లు! అద్భుతం!

"పిల్లని తీసుకురండి అన్నయ్యగారూ!" పట్టు చీర సవరించుకుంటూ చెప్పింది కాంతం.

మేలిముసుగు సవరించుకూంటూ వచ్చి కూర్చున్న శ్రావణిని చూసేసరికి తల్లీ, కొడుకులు కంగారుపడ్డారు.

"వదినగారూ! మా అమ్మాయి నచ్చలేదా? అలా కంగారుపడుతున్నారేమిటి? శ్రావణీ! నీ అత్తమామలకి— భర్తకి నమస్కరించమ్మా!" నవ్వుతూ వాళ్ళనే పరిశీలిస్తూ అన్నాడు విఠల్.

భర్త కళ్ళలోకి సూటిగా చూసింది శ్రావణి! అతను తడబాటుగా— "మోసం! దగా" అంటూ అరుస్తూ బయటకెళ్ళబోయాడు. "ఎవడిదిరా దగా! కుట్రా! పెళ్ళి మీద పెళ్ళి చేసుకుంటూ డబ్బు సంపాదించి అమెరికా వెళ్ళిపోదాం అనుకున్న నీది కాదా! కాళ్ళ పారాణి ఆరకముందే మూడు రాత్రులు అనుభవించి, భార్యనూ— నువ్వు బతికి ఉండగానే విడో చేశావే! అది దగా కాదా! నీ కామానికి బలి అయి ఒక కొడుకుని కని జీవశ్చవంలా బ్రతుకు ఈడ్చుకుంటున్న ఈ ఇల్లాలిని చూడరా! రాస్కెల్! నీకు మామూలు శిక్ష పనికిరాదు! ఎస్.ఐ.గారూ! వీళ్ళని లాకప్‌లో పెట్టండి. ఇవిగో సాక్ష్యాధారాలు! రేపు మా లాయర్‌గారు, నేను వస్తాం స్టేషన్‌కి! తాళాలు గట్టిగా వేసి, కాపలా దిట్టంగా ఉంచండి! తల్లీ! కొడుకులు పరమ కేడీలు!" అంటూ వాళ్ళని పోలీసు వేన్ ఎక్కించి లోపలికి వచ్చాడు విఠల్. నెలరోజులు కోర్టు చుట్టూ తిరగడంతో గడిచిపోయింది. కేసు శ్రావణి గెలుచుకొంది! అత్తగారికి, భర్తకి ఆరు సంవత్సరాలు కఠిన కారాగారవాసం వచ్చింది! భర్త ఉద్యోగం శ్రావణికి వచ్చింది.

ఎంతో నేర్పుగా శ్రావణి కథ సుఖాంతం చేసినందుకు వెంకటేష్ సి.ఐ.డి. విఠల్‌కి కృతజ్ఞతలు తెలియజేశాడు. ఆడపిల్ల అంటే ఆదిశక్తి స్వరూపం! ధైర్యంగా సమస్యలు ఎదుర్కోవాలి కానీ, భీరువులా కిరసనాయిల్ పోసుకునో, పురుగుల మందు త్రాగో చనిపోవడం జీవితానికి ముగింపు కాకూడదు! బెస్ట్ ఆఫ్ లక్! శ్రావణి వెన్ను మీద చిన్నగా కొడుతూ అన్న విఠల్ మాటలకు అందరూ గలగలా నవ్వారు!

●